క్లుప్తంగా

అన్నివర్గాల సంక్షేమానికి పెద్దపీట

ముషీరాబాద్: ప్రధాని మోదీ నాయకత్వంలో దేశ ప్రజలు సుభిక్షంగా ఉన్నారని ముషీరాబాద్ నియోజకవర్గ కన్వీనర్ రమేష్‌రాం అన్నారు. మోదీ పాలన 11 సంవత్సరాలు విజయవంతంగా పూర్తయిన సందర్భంగా 'వికసిత్ భారత్ సంకల్ప సభ'లో భాగంగా రాంనగర్ ఈసేవ వద్ద కార్నర్ మీటింగ్‌ను నిర్వహించారు. అడిక్‌మెట్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు పాశం సాయికృష్ణయాదవ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రమేష్‌రాం మాట్లాడారు. అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు శేషసాయి, ప్రధాని నరేంద్రమోదీ అభియాన్ డివిజన్ కన్వీనర్ శ్యామ్, నాయకులు కె.రాజ్‌కుమార్, జి.జనార్దన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రతిభను వెలికితీయాలి

ముషీరాబాద్: విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి పోటీతత్వాన్ని పెంచి భవిష్యత్ పరీక్షలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ఒలింపిక్ యాడ్ పరీక్షలు దోహదపడుతాయని ప్రముఖ సినీ నటుడు, మోటివేటర్ కేవీ ప్రదీప్ కుమార్ అన్నారు. బుధవారం ఒలింపిక్ యాడ్ పరీక్ష ఫలితాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఈనెల 28న బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞానకేంద్రంలో ఒలింపిక్ యాడ్ పరీక్షల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం ఉంటుందన్నారు. అందులో నేషనల్ ర్యాంకులు, స్టేట్ ర్యాంకులు ఉంటాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఒలింపిక్ యాడ్ కమిటీ సభ్యులు ఎస్ఎన్ రెడ్డి, రాఘవ, జయరాంప్రసాద్, అస్లాం, పవన్ పాల్గొన్నారు.

మంత్రి వివేక్ ఆధ్వర్యంలో రాష్ట్రం అభివృద్ధి సాధించాలి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తెలంగాణ రాష్ట్ర కార్మిక, గనులు, భూగర్భశాఖ మంత్రిగా పదవి బాధ్యతలు చేపట్టిన జి.వివేక్‌వెంకటస్వామిని బుధవారం తెలంగాణ వ్యవసాయ అధికారుల సంఘం ప్రతినిధులు సత్కరించి అభినందనలు తెలిపారు. మంత్రి వివేక్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి సాధించాలని అభిలాషించారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డా. వైద్యనాథ్, కార్యదర్శి సంతోష్‌కుమార్, వ్యవసాయ అధికారుల సంఘం నాయకులు పాల్గొన్నారు.

రాజీవ్‌సాగర్‌పై ఆరోపణలు అవాస్తవం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: మంగ్లీ బర్త్ డే వేడుకల్లో రాజీవ్‌సాగర్ ఉన్నాడని వస్తున్న తప్పుడు ప్రచారాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు దళిత క్రిస్టియన్ నాయకులు రాయపాటి రవి, ఎంఎస్.ప్రకాష్‌రావు తెలిపారు. రాజీవ్ సాగర్‌పై వచ్చిన ఆరోపణలు నిరాధారమైనవని అన్నారు. బుధవారం బాగ్‌లింగంపల్లిలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ.. రాజీవ్‌సాగర్ మీద వ్యక్తిగత ప్రచారంతోపాటు దళిత క్రిస్టియన్ సమాజాన్ని లక్ష్యంగా చేసుకొని కుట్రలు పన్నుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాజీవ్‌సాగర్ ప్రజల పక్షపాతి అని అలాంటి వ్యక్తిపై ఇలాంటి తప్పుడు ప్రచారం చేయడం సరైనది కాదన్నారు. తెలంగాణలో దళిత క్రిస్టియన్లపై కావాలనే బురదజల్లె ప్రయత్నం చేస్తున్నారని అలాంటి ప్రయత్నాలను మానుకోకపోతే తగిన గుణపాఠం చెబుతామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో దళిత క్రిస్టియన్ నాయకులు ఐజాక్ అరవిందరావు, రావులపాటి మోజేష్ తదితరులు పాల్గొన్నారు.

పాఠ్యపుస్తకాల పంపిణీ

కాచిగూడ: ఉజ్వల భవిష్యత్‌కు బంగారు బాటలు వేసే ఇంటర్ విద్యను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని కాచిగూడ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చిరంజీవి అన్నారు. బుధవారం కాచిగూడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా అందజేస్తున్న పాఠ్య పుస్తకాలను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలంటే ఇష్టపడి చదువుకోవాలని సూచించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు అన్ని రంగాల్లో ముందంజలో ఉంటూ కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆయన పిలుపునిచ్చారు. అర్థం కాని పాఠ్యాంశాల విషయంలో అనుభవంగల అధ్యాపకుల ద్వారా తెలుసుకొని సందేహాలను నివృత్తి చేసుకోవాలని ఆయన చెప్పారు. కార్యక్రమంలో అధ్యాపకులు వి.ప్రసాదరావు, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ బి.లక్ష్మయ్య, శ్రీనివాసరావు, గీతాబాయ్, అనిల్‌రెడ్డి, నర్సిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మాలల సంక్షేమానికి కృషి చేస్తా

కాచిగూడ: కార్మిక ఉపాధికల్పన శాఖ మంత్రిగా జి.వివేకానంద్ బుధవారం సచివాలయం చాంబర్‌లో నూతనంగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు గోపోజు రమేష్‌బాబు ఆధ్వర్యంలో ప్రతినిధులు ఆయనను కలిసి శాలువాతో సత్కరించి పూలబొకే అందజేసి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా మంత్రి వివేక్ మాట్లాడుతూ... మాలల అభివృద్ధి, సంక్షేమానికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు. మాలలు అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు జాతీయ ఉపాధ్యక్షులు కొండ్ర రాజలింగం, వలికి కృష్ణమూర్తి, కార్యదర్శి నరసింగరావు, సలహాదారుడు సత్యనారాయణ పాల్గొన్నారు.

తొలగిస్తారు కానీ తరలించరు!

- వారానికి పైగా రోడ్లపైనే చెట్ల కొమ్మలు
- రాకపోకలకు ఇబ్బందులు స్థానికులు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు


వివేక్‌నగర్ సుధా హోటల్ వెళ్లే రోడ్డులో చెత్తాచెదారం, చెట్లకొమ్మలు


త్యాగరాయ గానసభ నగర గ్రంథాలయం వెళ్లే దారిలో..

చిక్కడపల్లి: గాంధీనగర్ డివిజన్‌లో చిక్కడపల్లి, వివేక్‌నగర్, నగర కేంద్ర గ్రంథాలయం, సుధా హోటల్ లేన్, పీపుల్స్ పార్క్ తదితర ప్రాంతాలలో విద్యుత్ తీగలకు అడ్డు వస్తున్న కొమ్మలను కొట్టేశారు. వాటిని రోడ్లపైనే పడేసి వెళ్లిపోయారు. వారానికి పైగా అవుతున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకున్న పాపానపోలేదు. చెట్ల కొమ్మలు రోడ్డుపైనే ఉండటంతో రోడ్డు కుంచించుకుపోయింది. దీంతో రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి.

- రోడ్లను ఊడ్చే పారిశుద్ధ్య సిబ్బంది చెత్తను చెట్ల కొమ్మల మధ్యలో వదిలేస్తున్నారు. అపరిశుభ్రంగా మారడంతో దోమలు, ఈగలు వృద్ధి చెంది చెందుతున్నాయి. దీంతో పిల్లలు, వృద్ధులు, మహిళలు విషజ్వరాల భారీన పడుతున్నారు. ఇప్పటికైనా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి చెట్టకొమ్ములు, చెత్తాచెదారాన్ని తొలగించాలని కోరుతున్నారు.

కామారెడ్డి డిక్లరేషన్‌ను అమలు చేయాలి

ధర్నాచౌక్‌లో తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం డిమాండ్



కవాడిగూడ: బీసీలకు స్థానిక సంస్థల్లో 18శాతం ఉన్న రిజర్వేషన్లను 42శాతానికి పెంచిన తరువాతే ఎన్నికలు నిర్వహించాలని పలువురు వక్తలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 34శాతం ఉన్న రిజర్వేషన్లను 18శాతానికి తగ్గించిన గత బీఆర్ఎస్ ప్రభుత్వానికి పట్టిన గతే కాంగ్రెస్ ప్రభుత్వానికి పడుతుందని సూచించారు. బుధవారం ఇందిరా పార్కు ధర్నాచౌక్‌లో తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ ఆధ్వర్యంలో బీసీ మహాసభలు నిర్వహించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లను కల్పిస్తామని ఇచ్చిన హామీని వెంటనే నిలబెట్టుకోవాలన్నారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్య, సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ నారాయణ, ఎమ్మెల్సీ మధుసుదానాచారి, కాంగ్రెస్ సీనియర్ నేత వి.హనుమంతరావు, కాంగ్రెస్ సంవిధాన్ బచావో కమిటీ చైర్మన్ డాక్టర్ వినయ్‌కుమార్, ఎంబీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ తాడూరి శ్రీనివాస్, బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపకులు దాసు సురేష్ తదితరులు హాజరై బీసీ మహాసభలకు మద్దతు పలికారు.

- ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు కామారెడ్డి డిక్లరేషన్‌లో బీసీలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. రిజర్వేషన్లను 42శాతానికి పెంచుతూ జీవో జారీ చేయకుండా రాజకీయ లబ్ధి కోసం మెలికపెట్టి ముందుకెళ్తే కాంగ్రెస్ పార్టీకి పుట్టగతులు ఉండవన్నారు. రిజర్వేషన్లను తొమ్మిదో షెడ్యూల్‌లో చేర్చడానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. రిజర్వేషన్లను కల్పించకపోతే గ్రామ గ్రామాన బీసీలు ఆమరణ నిరాహార దీక్షకు దిగుతారని హెచ్చరించారు. సంఘం జాతీయ సమన్వయకర్త గుజ్జ కృష్ణ, సీపీఎం కార్యదర్శివర్గ సభ్యుడు బండారి రవికుమార్, నాయకులు పి.ఆశయ్య, నందగోపాల్, వేముల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శుల సమస్యలు పరిష్కరించాలి


పంచాయతీ రాజ్ ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీధర్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న సందిల బలరాం తదితరులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తెలంగాణ రాష్ట్రంలో పంచాయతీ కార్యదర్శుల దీర్ఘకాలిక పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని బుధవారం తెలంగాణ పంచాయతీ సెక్రటరీస్ సెంట్రల్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు సందిల బలరాం కోరారు. ఈ మేరకు బుధవారం పంచాయతీ రాజ్ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎన్.శ్రీధర్‌కువినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నూతనంగా ప్రిన్సిపల్ సెక్రటరీగా పదవి బాధ్యతలు చేపట్టిన శ్రీధర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. గ్రామ పంచాయతీ గ్రేడింగ్ కేబినెట్ పొందడం సంతోషదాయకమని అన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఓపీఎస్‌లుగా పని చేస్తున్న వారిని జేపీఎస్‌లుగా కన్వర్ట్ చేస్తూ నాలుగేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న వారికి గ్రేడ్ ఫోర్త్‌గా నియమించాలన్నారు. జూనియర్ పంచాయతీ కార్యదర్శుల నాలుగేళ్ల విధి నిర్వహణ కాలాన్ని సర్వీసుగా పరిగణిస్తూ ప్రొబేషన్ డిక్లేర్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ ఫోరం రాష్ట్ర కార్యదర్శి పి.వెంకటరమణ, గోదా రాజు, వేమరెడ్డి, తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పన్ను బకాయిలను పకడ్బందీగా వసూలు చేయాలి


సమీక్ష సమావేశంలో డీఎంసీ మారుతీదివాకర్

అంబర్‌పేట: ఆస్తి పన్ను బకాయిలను పకడ్బందీగా వసూలు చేయాలని సర్కిల్-16 డీఎంసీ మారుతీ దివాకర్ సూచించారు. బుధవారం తన కార్యాలయంలో ట్యాక్స్ ఇన్స్‌స్పెక్టర్లు, బిల్ కలెక్టర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సర్కిల్ పరిధిలో ఆస్తిపన్ను కోసం ఇచ్చిన చెక్కులు బౌన్స్ అయ్యాయని వారి వద్ద తరిగి ఆస్తిపన్ను వసూలు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి నిత్యం ఆస్తిపన్ను వసూలు చేయాల్సిందేనని ఆయన వారికి స్పష్టం చేశారు. అలాగే ఇకపై ట్రేడ్‌లైసెన్స్ బాధ్యత సైతం ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లకు అప్పగించారని అన్నారు. సర్కిల్ పరిధిలో ట్రేడ్ లైసెన్స్‌ల జారీ, లైసెన్స్ ఫీజులు వసూలు చేయాలని ఆయన వారికి సూచించారు. ఈ సమావేశంలో ఏఎంసీ రవీందర్, సూపరింటెండెంట్ శివకుమార్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

మంగళాభట్ మృతి తీరనిలోటు

చిక్కడపల్లి: ప్రముఖ నృత్యకళాకారిణి, కథక్ నాట్య గురువు మంగళాభట్ మరణం తీరనిలోటని కథక్ కళాక్షేత్ర నృత్యగురువు పండిట్ అంజిబాబు అన్నారు. బుధవారం చిక్కడపల్లిలోని కథక్ కళాక్షేత్రంలో మంగళాభట్ సంతాపసభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొన్నేళ్లుగా కథక్ నాట్యంలో ఎందరో శిష్యులను తీర్చిదిద్దారని గుర్తుచేశారు. ఆమె అందించిన చిరస్మరణీయమని అన్నారు. తొలుత ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

లేబర్ కోడ్‌లను ఉపసంహరించుకోవాలి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే ఉపసంహరించుకోవాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడగు భాస్కర్ డిమాండ్ చేశారు. బుధవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జీహెచ్ఎంసీ ఉద్యోగ, కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పాలడగు భాస్కర్ మాట్లాడుతూ... కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం 11 ఏళ్లుగా కార్మిక, ప్రజా వ్యతిరేక పాలనను సాగిస్తోందని విమర్శించారు. జాతీయ సహజవనరులు, ప్రభుత్వరంగ సంస్థలను కారుచౌకగా కార్పొరేట్ సంస్థలకు అమ్మేస్తున్నారని విమర్శించారు. డీజిల్, పెట్రోల్, వంటగ్యాస్ తదితర నిత్యావసరాల ధరలు పెంచి ప్రజలపై పెనుభారాన్ని మోపుతున్నారని విమర్శించారు. మతోన్మాద విధానాలను నిరసిస్తూ జూలై 9న జరిగే దేశవ్యాప్త సమ్మెలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు రెబ్బ రామరావు, పి.వెంకటయ్య, జె.వెంకటేష్, కురుమయ్య, షరీఫ్, ఎం.నరిసింహ, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.


సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన సమావేశంలో అభివాదం చేస్తున్న పాలడుగు భాస్కర్ తదితరులు

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: అజామబాద్ డివిజన్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల నిమిత్తం పలు ప్రాంతాల్లో గురువారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏడీఈ నాగేశ్వర్ తెలిపారు. నారాయణగూడ ఫీడర్ పరిధిలోని గౌరమ్మగల్లీ, సూర్యనగర్, నెహ్రూనగర్, మానస ఎన్‌క్లేవ్, ఆరోర డీగ్రీ కాలేజ్, ఈడబ్ల్యూఎస్ క్వార్టర్స్, బాగ్‌లింగంపల్లి తదితర ప్రాంతాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు... చిక్కడపల్లి ఫీడర్ పరిధిలోని చిక్కడపల్లి, వెంకటేశ్వరస్వామి టెంపుల్, ఉమా గార్డెన్ తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 2గంటల నుంచి 5గంటల వరకు... ఆర్‌టీఎం ఫీడర్ పరిధిలోని ఎంఆర్‌ఓ ఆఫీస్, ఆర్టీసీ కళ్యాణ మండపం, సోప్ ఫ్యాక్టరీ, అచ్చయ్యనగర్, రాజేంద్ర ఆయిల్‌మిల్ తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

20న డయల్ యువర్ ఆర్ఎం

కాచిగూడ: ఆర్టీసీ ప్రయాణికుల నుంచి సమస్యలు తెలుసుకోవడంతో పాటు సలహాలు, సూచనలు తీసుకుంటున్నట్లు ఆర్టీసీ హైదరాబాద్ రీజినల్ మేనేజర్ సుధా పరిమళ తెలిపారు. బుధవారం కాచిగూడలోని ఆర్టీసీ ఆర్ఎం కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ... ఈనెల 20న ఉదయం 11 నుంచి 12గంటల వరకు 'డయల్ యువర్ ఆర్ఎం'కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ప్రయాణికులు తమ సూచనలు, ఫిర్యాదులను ఫోన్ నం .88857 19194లో తెలియజేయాలని కోరారు.

గంగపుత్రుల ఐక్యతకు పూస శ్రీరాములు కృషి ఎనలేనిది

ముషీరాబాద్: ముషీరాబాద్ గంగపుత్ర సంఘం నాయకులు పూస శ్రీరాములు గంగపుత్రుల ఐక్యతకు, న్యాయమైన హక్కుల సాధనకు ఆయన చేసిన కృషి మరువలేనిదని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. ముషీరాబాద్ గంగపుత్ర సంఘం సీనియర్ నాయకుడు పూస శ్రీరాములు(81) బుధవారం గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఆయన నివాసానికి వెళ్లి పూస శ్రీరాములు పార్థివదేహానికి నివాళులర్పించారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయనతో పాటు కార్పొరేటర్లు సుప్రియానవీన్‌గౌడ్, రవిచారి, ఆలిండియా గంగపుత్ర సంఘం ఉపాధ్యక్షులు పూసగోరక్‌నాథ్ తదితరులు నివాళులర్పించారు. గంగపుత్ర సంఘం శ్మశానవాటికలో అంత్యక్రియలు జరిగాయి.

ఇందిరాపార్కులో జరిగిన బహిరంగసభలో అభివాదం చేస్తున్న ప్రొ. కె. నాగేశ్వర్, పాలడుగు భాస్కర్



విద్యుత్ ఆర్టిజన్స్‌ను కన్వర్షన్ చేయాలి

మాజీ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కె.నాగేశ్వర్

కవాడిగూడ: తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న దాదాపు 20వేల మంది ఆర్టిజన్లను కన్వర్షన్ చేయాలని మాజీ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కె.నాగేశ్వర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యుత్ ప్రమాదాలను నివారించడంలో యాజమాన్యం పూర్తిగా విఫలం చెందిందని ఆయన ఆరోపించారు. బుధవారం తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్స్ కన్వర్షన్ జేఏసీ ఆధ్వర్యంలో ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో కార్మికులు కుటుంబ సమేతంగా తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలనే డిమాండ్‌తో బహిరంగసభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రొ. కె.నాగేశ్వర్, సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ హాజరయ్యారు.

- ఈ సందర్భంగా ప్రొ. కె.నాగేశ్వర్ మాట్లాడుతూ... తెలంగాణలోని ఎస్పీడీసీఎల్, ట్రాన్స్‌కో, జెన్‌కో, తదితర విద్యుత్ సంస్థల్లో దాదాపు 20 వేల మంది ఆర్టిజన్ కార్మికులుగా సేవలు అందిస్తున్నారని తెలిపారు. వారందరినీ విద్యార్హతలను బట్టి జూనియర్ లైన్‌మెన్, సబ్ ఇంజినీర్, జూనియర్ అసిస్టెంట్, సబార్డినేట్ పోస్టులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కన్వర్షన్ చేయడం వల్ల ప్రభుత్వ ఖజానాపై ఎలాంటి అదనపు ఆర్థికభారం పడదన్నారు.
- సీఐటీయూ ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ.. విద్యుత్ సంస్థల్లో పని చేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని విద్యుత్ శాఖ మంత్రి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కను కోరామన్నారు. అయినా పట్టించుకోకపోవడం దుర్మార్గమని అన్నారు. విద్యుత్ కార్మికులతో పెట్టుకుంటే గత ప్రభుత్వాలకు పట్టిన గతే కాంగ్రెస్ ప్రభుత్వానికి పడుతుందని హెచ్చరించారు. బహిరంగ సభకు జేఏసీ చైర్మన్ కె.ఈశ్వరరావు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ ఎంఏ వజీర్, కో చైర్మన్ జి.నాగరాజు, సహాయ కార్యదర్శులు చంద్రశేఖర్‌రెడ్డి, కె.లింగం, రఘునాథ రెడ్డి, జేఏసీ నేతలు రాఘవేంద్రరెడ్డి, కోటిగౌడ్, సలీమా అఫ్సా కె. వెంటేష్, ప్రసాద్ రాజు, ఆర్టిజన్ల కుటుంబ సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఉద్యమకారులకు ఇచ్చిన హామీని నెరవేర్చాలి


తెలంగాణ ఉద్యమకారుల రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న జస్టిస్ చంద్రకుమార్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలకపాత్ర పోషించి ఎన్నో త్యాగాలు చేసిన తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన మాటను ప్రభుత్వం నెరవేర్చాలని హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి.చంద్రకుమార్ అన్నారు. ఉద్యమకారులను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని ఉద్యమకారులు నిరుద్యోగులతో చెలగాటం ఆడొద్దని ఆయన అన్నారు. బుధవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆల్ ఇండియా ఓబీసీ జాక్ చైర్మన్ సాయిని నరేందర్ అధ్యక్షతన తెలంగాణ ఉద్యమకారుల రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న జస్టిన చంద్రకుమార్ మాట్లాడారు. సాధించుకున్న తెలంగాణలో ఉద్యమకారులు ఎన్నో కష్టాలు పడుతున్నారని కాంగ్రెస్ మేనిఫెస్టోలో పొందుపరిచిన అంశాలను నెరవేర్చాలని కోరారు. ఉద్యమకారులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని.. ఉద్యమకారులపై కేసులు ఎత్తి వేయాలన్నారు. అమరుల కుటుంబాలకు ఉద్యోగంతో పాటు రూ.25వేల పెన్షన్ ఇవ్వాలని కోరారు. ఉద్యమకారుల గుర్తింపు కోసం చట్టబద్ధమైన కమిటీని నియమించి మార్గదర్శకాలను ప్రకటించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి, అరుణోదయ విమలక్క, సాంస్కృతిక సమైక్య చైర్మన్ వెన్నెల గద్దర్, భక్తుల సిద్ధేశ్వర్, పసునూరి రవీందర్, మన్నారం నాగరాజు, కోలా జనార్దన్‌గౌడ్ తదితరులు పాల్గొని ప్రసంగించారు.

కాచిగూడ ట్రాఫిక్ పీఎస్ తరలింపు పూర్తి

ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఎ.శ్రీనివాస్



అంబర్‌పేట: అంబర్‌పేట: నారాయణగూడ ఐపీఎం కేంద్రంలో ఉన్న కాచిగూడ ట్రాఫిక్ పోలీసుస్టేషన్‌ను బుధవారం అంబర్‌పేట సీపీఎల్ రోడ్‌లో ఉన్న అంబర్‌పేట ట్రాఫిక్ పీఎస్ భవనంలోకి మార్చారు. కాచిగూడ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఎ.శ్రీనివాస్‌తో పాటు ఇతర సిబ్బంది ఇక్కడికి విచ్చేసి విధులకు హాజరయ్యారు. ఇతర సామగ్రిని సైతం తరలించారు. తరలింపు ప్రక్రియా పూర్తి కావడంతో ఇకపై కాచిగూడ ట్రాఫిక్ పోలీసులు ఇక్కడి నుంచే విధులు నిర్వర్తిస్తారని తెలిపారు. అంబర్‌పేట, కాచిగూడ లా అండ్ ఆర్డర్ పీఎస్‌ల పరిధిలోకి వచ్చే ప్రాంతాలన్నీ ఇకపై కాచిగూడ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలోకి వస్తాయని పేర్కొన్నారు.

చిక్కడపల్లి, గాంధీనగర్ ట్రాఫిక్ ఠాణాల మార్పు



చిక్కడపల్లి: గోల్కొండ చౌరస్తా సమీపంలో ఉన్న చిక్కడపల్లి ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ కార్యాలయాన్ని నారాయగూడ మెట్రో పిల్లర్ నం.1177 వద్ద ఉన్న కాచిగూడ ట్రాఫిక్ పీఎస్ కార్యాలయానికి మార్చారు. చిక్కడపల్లి, ముషీరాబాద్ లా అండ్ ఆర్డర్ పోలీస్‌స్టేషన్ల పరిధిలోకి వచ్చే ప్రాంతాలన్నీ చిక్కడపల్లి ట్రాఫిక్ పీఎస్ పరిధిలోకి రానున్నాయి. అదేవిధంగా కొత్తగా ఏర్పాడ్డ గాంధీనగర్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ కార్యాలయాన్ని గోల్కొండ చౌరస్తాలోని చిక్కడపల్లి ట్రాఫిక్ ఠాణాకు మార్చారు. గాంధీనగర్, దోమలగూడ లా అండ్ ఆర్డర్ పోలీస్‌స్టేషన్ల పరిధిలోకి వచ్చే ప్రాంతాలన్నీ గాంధీనగర్ ట్రాఫిక్ పీఎస్ పరిధిలోకి రానున్నాయి.

యోగాతో ఆరోగ్యం పదిలం


చిక్కడపల్లిలో జరిగిన యోగా కార్యక్రమంలో యోగా మాస్టార్‌ను సత్కరిస్తున్న గడ్డం సతీష్‌కుమార్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: యోగాతో ఆరోగ్యం పదిలంగా ఉంటుందని రాంనగర్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు గడ్డం సతీష్‌కుమార్ అన్నారు. నిత్యం యోగా చేయడం వల్ల దీర్ఘకాలిక వ్యాధులు కూడా అదుపులో ఉంటాయని అన్నారు. అంతర్జాతీయ యోగా డేను పురస్కరించుకొని ఆయన చిక్కడపల్లి కమిటీహాల్‌లో యోగా కార్యాక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు ప్రపంచ వ్యాప్తంగా యోగాకు మంచి ఆదరణ ఉందని తెలిపారు. అన్ని అవయవాలు సక్రమంగా పని చేయడానికి నిత్యం పనిచేసే యోగా దోహదపడుతుందన్నారు. అనంతరం యోగా మాస్టార్ అనితారెడ్డిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో కరాటే మాస్టార్ రాజు, కేశవ్, కే.ఉపేందర్, శ్రీను, ఉమామహేష్, బాబు, రఘు, ప్రభావతి, జైవీర్, కర్ణం బాబు తదితరులు పాల్గొన్నారు.

యోగాతో శరీరం, మనసు మధ్య సమతుల్యత సాధ్యం

చిక్కడపల్లి: యోగాతో ఆరోగ్యం మెరుగుపడుతుందని బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజవర్గం జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్‌కుమార్ పేర్కొన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని బీజేపీ డివిజన్ అధ్యక్షుడు నవీన్‌కుమార్ ముదిరాజ్ ఆధ్వర్యంలో ముందస్తుగా బుధవారం డివిజన్‌లోని జవహర్‌నగర్ కమ్యూనిటీహాల్ ఆవరణలో యోగాసనాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... యోగా శరీరం, మనసు మధ్య సమతుల్యత సాధించడంలో దోహదపడుతుందన్నారు. ఈ నెల 21న కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి పర్యవేక్షణలో ఎల్బీస్టేడియంలో నిర్వహించే యోగా దినోత్సవంతో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నాలన్నారు. ఈ కార్యక్రమంలో యోగా శిక్షకుడు ఎస్.దీనస్, నేతలు శ్రీకాంత్, దామోదర్, వీఎస్టీ రాజు, సత్తిరెడ్డి, పాలశ్రీను, ప్రకాష్‌యాదవ్, సత్యేంధర్ తదితరులు పాల్గొన్నారు.


జవహర్‌నగర్ కమ్యూనిటీహాల్ ఆవరణలో యోగాసనాలు వేస్తున్న వినయ్‌కుమార్

'యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుంది'

ముషీరాబాద్: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని ముషీరాబాద్ నియోజకవర్గం యోగా ప్రొగ్రామ్ కోకన్వీనర్ బిజ్జి కనకేష్‌కుమార్ అన్నారు. బుధవారం ప్రపంచ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని బోలక్‌పూర్ పార్కులో యోగాసనాలు వేశారు. ఆయన మాట్లాడుతూ.. ఎల్‌బీ స్టేడియంలో కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగే యోగా కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కృషి చేస్తున్నామని అన్నారు. యోగాలో శిక్షణ పొందిన వారు పెద్ద ఎత్తున తరలి వచ్చేలా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. యోగాకు ప్రపంచ స్థాయిలో గుర్తింపు తెచ్చిన ప్రధాని నరేంద్రమోదీ ఆశయలకు అనుగుణంగా పని చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బద్రి నారాయణ, రాజశేఖర్, శివ, బబ్లూ, చంద్రమోహన్, నిత్యానంద్, కృష్ణ, పరమేశ్వర్, నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.


భోలక్‌పూర్‌లో యోగా చేస్తున్న ఓబీసీ మోర్చా రాష్ట్ర నాయకుడు బిజ్జి కనకేష్